క్లుప్తంగా

వర్షం నీరు తొలగింపు

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు ఇందిరా కాలనీలో భారీ వర్షాలకు మునక బారిన పడి స్థానికులకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఆదివారం గ్రామ కార్యదర్శి నరసింహారావు తమ సిబ్బందితో ఇంజిన్ ద్వారా వర్షం నీటిని తొలగింపు చర్యలను చేపట్టారు.

వరద నీటిని పరిశీలించిన నాయకులు

మండవల్లి: మండలంలోని పెదయెడ్లగాడి–పెనుమాకలంక రోడ్డుపై వెళుతున్న వరద నీటిని ఎన్డీఏ కూటమి నాయకులు ఆదివారం పరిశీలించారు. ఇటీవల కురిసిన వర్షాలకు కొల్లేరుకు పెద్ద ఎత్తున ఎగువ నుంచి డ్రెయిన్లలోని నీరు రావడంతో ఉగ్రరూపం దాల్చింది. ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ఆదేశాల మేరకు కూటమి నాయకులు పరిశీలించి పరిస్థితిని సమీక్షించారు. నాయకులు చాపరాల దుర్గాప్రసాద్, సురేష్‌బాబు, గుంటూరు సత్యనారాయణ, ఎస్సై రామచంద్రరావు, వీఆర్వో వెంకటేశు, కార్యదర్శి రాము పాల్గొన్నారు.

ముగిసిన గంగానమ్మజాతర

జమీదగ్గుమిల్లి(పామర్రు): గ్రామంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న గంగా నమ్మ జాతర ఆదివారంతో ముగింది. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారికి జల బిందెలతో విశేషంగా అభిషేకాలను చేసి, పసుపు కుంకుమలతో నూతన వస్త్రాలతో అమ్మవారిని అలంకరించారు. అనంతరం భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులను తీర్చుకున్నారు. కార్యక్రమంలో గంగానమ్మ తల్లి ఆలయ కమిటీ సభ్యులు, సీతారామాంజనేయస్వామి ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కైకలూరులో..

కైకలూరు: గంగానమ్మ జాతర ఆదివారంతో ముగిసింది. పోలీసు సిబ్బంది అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. నిర్వాహకులు తులసి పూర్ణ, జట్టి గంగాశ్యామ్, జె.ఆంజనేయులు, ఎన్.మణికంఠ, శివకుమార్, సుధీర్, నరసింహా, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

గంగానమ్మతల్లి ఆలయంలో భక్తుల రద్దీ

పమిడిముక్కల: స్థానిక గంగానమ్మతల్లి ఆలయం శ్రావణమాసం చివరి ఆదివారం కావడంతో భక్తులతో కిటకిటలాడింది. పరిసర గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

ఉచిత వైద్యశిబిరం



పసుమర్రు(పామర్రు): ఇంటర్నేషనల్ లయన్స్ క్లబ్ ఆఫ్ తాడిగడప సాయినగర్, కాజాస్ హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో మండలంలోని పసుమర్రు గ్రామంలోని ఫంక్షన్ హాల్లో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. పసుమర్రు గ్రామంతో పాటు జురువరం, పరిశేపల్లి, డోకిపర్రు, పామర్రు, గుడివాడ తదితర గ్రామాల నుంచి సుమారు 400 మంది రోగులు ఉచిత వైద్య సేవలను పొందారు. అవసరమైన వారికి మందులను ఉచితంగా అందజేశారు. గుడివాడ వివాన్ హాస్పిటల్స్ వైద్యులు డాక్టరు యడ్లపల్లి హర్ష, కొల్లి చందన, పీ సందీప్, గోర్జి పృథ్వీ వైద్య సేవలను అందజేశారు. కాజాస్ హెల్పింగ్ హ్యాండ్స్ చైర్మన్ కాజ చక్రధరబాబు, వెంకటరమణి, గ్రామ మాజీ సర్పంచ్ బొప్పన కోటేశ్వరరావు, కాజ వెంకటసుబ్బయ్య చౌదరి ఆధ్వర్యంలో శిబిరం నిర్వహించారు. తొలుత శిబిరాన్ని లయన్స్ క్లబ్ పూర్వ జిల్లా గవర్నర్ వైపీసీ ప్రసాద్ ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ కాకి నాగేంద్ర, క్లబ్ అధ్యక్షుడు ఎల్ఎన్ కుమార్, సెక్రటరీ వై సురేష్, కోశాధికారి రాజారావు, సభ్యులు శ్రీనివాసరావు, ఆర్.సతీష్ పాల్గొన్నారు.

రోడ్లు పరిశీలన

గుడ్లవల్లేరు: కురిసిన వర్షాలకు గుడ్లవల్లేరు జగనన్న కాలనీలో మునక బారిన పడిన రోడ్లను ఇన్‌చార్జి తహసీల్దార్ బి.కనకదుర్గ ఆదివారం పరిశీలించారు. వడ్లమన్నాడు, కొతవరంలో పర్యటించి మునిగిన పొలాలను కూడా పరిశీలించారు. తమ పరిశీలనలో సేకరించిన వివరాలను ఉన్నతాధికారులకు నివేదిస్తామని కనకదుర్గ తెలిపారు. ఆర్ఐ షకీలాబేగం, వీఆర్వోలు శాయన ప్రకాష్, సనకా భాస్కరరావు, మల్లికార్జునరావు, రామ్మూర్తి, రమేష్ పాల్గొన్నారు.

వర్షాలకు కుప్పకూలిన పెంకుటిల్లు

వెంట్రప్రగడ(పెదపారుపూడి): మూడు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని వెంట్రప్రగడ గ్రామానికి చెందిన గొరిపర్తి రాంబాబుకు చెందిన పెంకుటిల్లు కూప్పకూలిపోయింది. అధికారులు స్పందించి సాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

నీట మునిగిన 2,470 ఎకరాల వరిపైరు

కైకలూరు: అల్పపీడనం వలన కురిసిన భారీ వర్షాలకు కైకలూరు నియోజకవర్గంలో 2,470 ఎకరాల్లో వరిపైరు నీట మునిగింది. వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు గంగాధరరావు, కైకలూరు, కలిదిండి వ్యవసాయాధికారులు దివ్య, విద్యాసాగర్ క్షేత్ర స్థాయిలో రైతులకు నష్ట నివారణ చర్యలను ఆదివారం వివరించారు.

బుడమేరు ఉగ్రరూపం

- ముంపు బారిన గ్రామాలు
- నీట మునిగిన పంట పొలాలు
- పుట్టగుంట వంతెన వద్ద రాకపోకలకు బ్రేక్

అల్పపీడన ప్రభావంతో కుండపోతగా కురిసిన వర్షాలకు ప్రధాన డ్రెయిన్లు, పంట కాల్వలు, చానల్స్ పొంగిపొర్లుతున్నాయి. ప్రధానంగా బుడమేరు ఉగ్రరూపం దాల్చింది. 15 సంవత్సరాల తర్వాత పుట్టగుంట వంతెన వద్ద బుడమేరు నీటి ప్రవాహం 20.5 అడుగులకు చేరడంతో ఎంఎన్‌కే రహదారిపై గుడివాడ–హనుమాన్ జంక్షన్‌కు రాకపోకలను అధికారులు నిలుపుదల చేశారు.



మండవల్లి మండలం ఉనికిలి ఎస్సీ కాలనీలో ఇళ్లలోకి చేరిన వర్షం నీరు



మొవ్వ మండలం ఐనంపూడి వద్ద కోతకు గురైన కట్టను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు



పొంగిపొర్లుతున్న బుడమేరు

గుడివాడరూరల్: బుడమేరు వంతెనపై నుంచి నీరు ఉద్ధృతంగా ప్రవహిస్తుండటంతో వాహనాలు వెళితే గల్లంతయ్యే అవకాశం ఉండటంతో అధికారులు తగిన రక్షణ చర్యలు చేపట్టారు. వంతెనపై వాహనాలు వెళ్లకుండా ఇన్‌చార్జి తహసీల్దార్ మల్లిక, నందివాడ ఎస్ఐ కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో రెవెన్యూ, పోలీస్ సిబ్బందితో కలసి బందోబస్తు ఏర్పాటు చేశారు. వరద ఉద్ధృతి తగ్గే వరకు వాహన రాకపోకలు నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. హనుమాన్‌జంక్షన్ వైపు నుంచి గుడివాడ వైపు, గుడివాడ నుంచి హనుమాన్‌జంక్షన్ వైపు వెళ్లే వాహనాలను ఇతర ప్రాంతాల వైపు వెళ్లేలా వాహనదారులు ప్రత్యామ్నాయాలను చూసుకోవాలని అధికారులు సూచించారు. గ్రామాల్లోనూ రెడ్ అలెర్ట్ ప్రకటించినట్లు ఇన్‌చార్జి తహసీల్దార్ తెలిపారు. వరద ముంపు ఉన్న బుడమేరు పరివాహక ప్రాంతాలైన చిన లింగాల, ఒద్దుల మెరక, చేదుర్తిపాడు, పుట్టగుంట, పెద లింగాల, అరిపిరాల గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. గ్రామాల్లో ముంపునకు గురయ్యే అవకాశం ఉన్న కాలనీల వాసులు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

వరద ఉద్ధృతి

గుడివాడ నియోజకవర్గంలోని బుడమేరు, చంద్రయ్య, భూమికోడు, నెహ్రూల్లీ, మోటూరు ఎల్ఎస్ డ్రైన్, పోల్‌రాజ్ డ్రెయిన్ల వరద ఉద్ధృతితో పరిసర ప్రాంతాల్లోని పంట పొలాలు నీట మునిగాయి. రూరల్ మండలంలోని మోటూరు డ్రెయిన్ పొంగుతుండటంతో పర్నాస, కల్వపూడి అగ్రహారం, మోటూరు, గుంటాకోడూరు గ్రామాల్లో వరి పొలాలు ముంపు బారిన పడ్డాయి. పంట పొలాలు వరద ముంపు బారిన పడటంతో రైతులు లబోదిబోమంటున్నారు.

అధికారుల పాపం రైతులకు శాపం

ప్రధాన డ్రెయిన్లు పొంగిపొర్లి పంట పొలాలు ముంపు బారిన పడటానికి డ్రెయినేజీ అధికారుల నిర్లక్ష్యమే కారణమంటూ రైతులు ఆరోపిస్తున్నారు. ప్రతి ఏడాది మాదిరిగానే డ్రెయిన్లలో గుర్రపుడెక్క, తూడు, పూడిక తొలగింపు పనులకు టెండర్ల ద్వారా పనుల నిర్వహణకు అధికారులు కాంట్రాక్టర్లకు పనులు అప్పగించారు. అయితే ఖరీఫ్ సీజన్ ముమ్మరంగా ఉన్న సమయంలో బుడమేరు, చంద్రయ్య, మోటూరు డ్రెయిన్లలో గుర్రపుడెక్క దట్టంగా పేరుకుపోయి నీటి ప్రవాహానికి అవరోధంగా ఉంది. కాంట్రాక్టర్లు సకాలంలో తూడు తొలగింపు పనులు చేపట్టకపోవడంతో ప్రస్తుతం వరదలకు గత 15ఏళ్లలో ఎన్నడూ రాని విధంగా బుడమేరుకు నీరు వచ్చి రాకపోకలకు అంతరాయం కలిగించే పరిస్థితిని తెచ్చి పెట్టింది. సంబంధిత అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.

ముంపు ప్రాంతాల పరిశీలన

మొవ్వ: మండలంలో మూడురోజులుగా కురిసిన భారీవర్షాలకు ముంపునకు గురైన వరి పొలాలను సీపీఎం మండల నాయకులు ఆదివారం పరిశీలించారు. నిడుమోలు, వీరాయిలంక, కాజ మంద పాలెం, అవినిపూడి, కోసూరు తదితర గ్రామాల్లో పర్యటించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మండల పరిధిలో సుమారు రెండు వేల ఎకరాలు నీట మునిగిందని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు శీలం నారాయణరావు తెలిపారు. కాగా కాజ శివారులోని మందపాలెం వద్ద గల ఐనంపూడి డ్రెయిన్ వంతెన వద్ద భారీగా నీరు ప్రవహించటంతో కరకట్ట కొట్టుకుపోయి, ప్రమాదంగా మారిందని తెలిపారు. గత నెలలో అధికారులు కోతకు గురైన కట్టను పరిశీలించారే గాని ఎటువంటి మరమ్మతులు చేపట్టలేదన్నారు. కోతకు గురైన కట్టను యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులు మద్దుల బసవరావు, ఉప్పలపు వెంకటాద్రి, కొడాలి కరుణాకర్‌రావు, వాసు, రాంబాబు, వెంకటాచలం పాల్గొన్నారు.



ఐనంపూడిలో ముంపునకు గురైన పంటను పరిశీలించి మాట్లాడుతున్న ఏఓ గణేష్‌రెడ్డి

నందివాడలో..

నందివాడ: నందివాడ మండలం ఇలపర్రు పంచాయతీ పరిధిలోని లక్ష్మీనరసింహపురంలో బుడమేరు ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. బుడమేరు పరివాహ ప్రాంతంలో పంటపొలాలు నీట మునిగాయి. బాధిత రైతులతో కలసి టీడీపీ మండల అధ్యక్షుడు దానేటి సన్యాసిరావు నీట మునిగిన పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సమస్యలను గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము దృష్టికి తీసుకెళ్లి సంబంధిత అధికారులతో మాట్లాడి, నష్ట నివారణ చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మూడు వేల ఎకరాల్లో వరిపంట మునక

పమిడిముక్కల: ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాల కారణంగా మండల పరిధిలో మూడు వేల ఎకరాల్లో వరిపంట నీట మునిగింది. గురజాడ, కూడేరులో చెరువులు నిండి పక్కనున్న పంటపొలాలు ముంపునకు గురయ్యాయి. ఐనంపూడి అండర్‌టన్నెల్ వద్ద నీరు ఎగదన్నడంతో ఐనంపూడి, ముళ్లపూడి, వేల్పూరు, కపిలేశ్వరపురం పరిధిలోని వరిపొలాలు పూర్తిగా నీటమునిగాయి. ఎగువన నుంచి వచ్చే నీరు వలన మంటాడ, తాడంకి, అమీనపురం, మేడూరు గ్రామాల్లోని వరిపంట ముంపునకు గురైంది. మండలంలోని కపిలేశ్వరపురం, ముళ్లపూడి, వేల్పూరు, ఐనంపూడి గ్రామాల్లో ఆదివారం ఏఓ గణేష్‌రెడ్డి పర్యటించి ముంపునకు గురైన పొలాలను పరిశీలించారు. రైతులకు సూచనలు, సలహాలు అందజేశారు. తాడంకి అండర్‌పాస్ వద్ద నీరు నిలిచి చెరువులా మారడంతో రాకపోకలు సాగక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. కృష్ణానదిలో వరద ఉద్ధృతి పెరడంతో కరకట్ట వెంబడి ఉన్న ఐనపూరు, లంకపల్లి గ్రామాల ప్రజలు నదిలోకి వెళ్లవద్దని, అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ నవీన్‌కుమార్ తెలిపారు.

ఎస్సీ కాలనీ జలమయం

మండవల్లి: అల్పపీడనం కారణంగా నాలుగు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని ఉనికిలి ఎస్సీ కాలనీ జలమయమైంది. దీంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఆసిలేటి సంసోను, మొగనాటి అనిల్‌ను నీటి పాములు కరిశాయి. వర్షం ఎక్కువగా కురవడంతో చేపల చెరువుల్లో నీరు బాగా పెరిగి, లెవెల్ పైపు వరకు నీరు రావడంతో బయటకు వదిలేస్తున్నారు. దీంతో రోడ్లపై నీరు భారీగా పెరిగి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

వర్షం నీటిలో వరి పొలాలు

గుడ్లవల్లేరు: మండలంలో కురిసిన భారీ వర్షాలకు వరి పొలాలు వర్షం నీటిలో నానుతున్నాయి. కురిసిన భారీ వర్షాలకు మురుగు నీరు బయటకు వెళ్లక అస్తవ్యస్తంగా ఉన్న వడ్లమన్నాడు డ్రెయిన్ కారణంగా వందల ఎకరాలు నీటిలో నానుతున్నాయి. ఎగువ ప్రాంతం నుంచి మురుగు వచ్చి పడటంతో పొలాలకు మురుగు ఎగదన్నుతోంది.



కోటిరెడ్డిపేటలో డ్రెయిన్ నిండి ఇంట్లోకి చేరిన నీరు



ముదినేపల్లి మండలం వణుదుర్రులో నీట మునిగిన వరిపొలాలను చూపుతున్న రైతులు

ముదినేపల్లిలో..

ముదినేపల్లి రూరల్: భారీ వర్షాలకు మండలంలోని గ్రామాల్లో వరి చేలు ముంపు బారిన పడ్డాయి. బీఎండీ చానల్ పరిధిలోని వాడవల్లి, వణుదుర్రు, వి.రావిగుంట, ఊటుకూరు, దేవపూడిని పొలాలు పూర్తిగా నీట మునిగాయి. అదేవిధంగా సింగరాయపాలెం, వడాలి, పెదగొన్నూరు పల్లపు ప్రాంతాల్లోని వరిచేలన్నీ చెరువులుగా మారిపోయాయి. నీట మునిగిన పొలాలను టీడీపీ నాయకులు నరసింహారావు, నాగరాజు పరిశీలించారు.

అధికారులతో సమీక్ష

భారీ వర్షాలకు ముంపు బారిన పడ్డ ప్రాంతాలను మండల ప్రత్యేక అధికారి ఆర్వీ నాగరాణి, ఎంపీడీఓ పి.మల్లీశ్వరీ ఆదివారం పరిశీలించారు. వర్షాల వలన రోడ్లపై నిలిచిపోయిన నీరు బయటకు పోయేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. పెయ్యేరు దళితవాడ కాలనీలో ఇళ్ల మధ్య నిలిచిపోయిన నీటిని జేసీబీతో కచ్చా డ్రెయిన్ తవ్వించి బయటకు పంపించారు. అనంతరంస్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈఓపీఆర్డీ దూలం లక్ష్మీనారాయణ, ఆర్ఐ పి.శివకుమార్, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లలోకి వర్షం నీరు

పామర్రు: రెండు రోజులుగా కురిసిన వర్షాలకు స్థానికంగా ఉన్న పామర్రు డ్రెయిన్ నిండిపోవడంతో పక్కనే ఉన్న గృహాల్లో నీరు చేరుతున్నాయి. పామర్రు డ్రెయిన్ ఆక్రమణలకు గురై కుచించుకుపోయిన కారణంగా నీరు దిగువనకు వెళ్లే మార్గం లేక అక్కడే నిల్వ చేరుతున్నాయి. దీంతో టిక్కిశెట్టి ప్రసాద్, కొప్పరాతి లక్ష్మీ నరసమ్మ తదితరుల గృహాల్లోకి నీరు చేరాయి. దీంతో వారు ఇబ్బందులు పడుతున్నారు. కనుమూరు, కురుమద్దాలి తదితర గ్రామాల్లోని వరి పొలాలు వర్షం నీటిలోనే నానుతున్నాయి.



పుట్టగుంట వద్ద గుడివాడ–హనుమాన్ జంక్షన్ రాకపోకలను నిలుపుదల చేసిన ఎస్ఐ శ్రీనివాస్

మండవల్లిలో..

మండవల్లి: మండలంలో పెరికెగూడెంలో కురుస్తున్న భారీ వర్షాలకు వరి పొలాలు పూర్తిగా నీట మునిగాయి. రైతులు గంపెడాశతో పొలాల్లో వరి నాట్లు వేసి వాటి మీద ఆశలు పెంచుకున్నప్పటికీ నిష్ప్రయోజనంగా మారింది. ప్రభుత్వం తమను ఆదుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు.

పొలాల పరిశీలన

గుడ్లవల్లేరు: భారీ వర్షాలకు మునకకు గురైన పంట పొలాలను ఆదివారం గన్నవరం విమానాశ్రయ అభివృద్ధి కమిటీ డైరెక్టర్ కె.తులసిబాబు, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయనకు రైతులు, టీడీపీ నాయకుల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. వడ్లమన్నాడు డ్రెయిన్ పనులపై నిర్లక్ష్యంగా వ్యవహరించటంతో పొలాలు మునక బారిన పడ్డాయని ఫిర్యాదు చేశారు. కూటమి నాయకులు మల్లిపెద్ది సుబ్రహ్మణ్యం, పామర్తి భాస్కరరావు, రాంబాబు, రమేష్, కృష్ణారావు పాల్గొన్నారు.

తోట్లవల్లూరులో..

పామర్రు(తోట్లవల్లూరు): తోట్లవల్లూరు మండలంలోని కృష్ణా నది పరీవాహక ప్రాంతాల్లో పలు పంటలు వరద నీటిలో మునిగిపోయాయి. వీటిలో ముఖ్యంగా పసుపు, చెరకు, కంద, వరి తదితర పంటలు నీటి పాలయ్యాయి.

పొంగి పొర్లుతున్న కాలువలు

మొవ్వ: అల్పపీడన ప్రభావంతో మొవ్వ మండలంలో కురిసిన 25 సెంటీమీటర్ల వర్షంతో మండలంలోని కాలువలు పొంగి పొర్లుతున్నాయి. మండలంలోని కూచిపూడి, పెదపూడి, మొవ్వ, కాజ, పద్దారాయుడుతోట, చినముత్తేవి, పెదముత్తేవి, అవురిపూడి, పాలంకిపాడు, నిడుమోలు, వీరాయిలంక తదితర గ్రామాల్లోని వందలాది ఎకరాలు నీట మునిగి చెరువుని తలపిస్తున్నాయి.మండలంలోని ఐనంపూడి, భీమనది, ఉప్పాయికోడు డ్రెయిన్లు ఉద్ధృతంగా ప్రవహిస్తున్నాయి.



పొంగి పొర్లుతున్న ఐనంపూడి డ్రెయిన్



గుడివాడ మండలంలో నీట మునిగిన వరి పొలాలు



గుడ్లవల్లేరు మండలం వడ్లమన్నాడులో వర్షం నీటిలో వరి పొలాలు



గుడ్లవల్లేరు మండలంలో సమస్యలు తెలుసుకుంటున్న తులసిబాబు, రావి

జలదిగ్బంధంలో లంకగ్రామాలు

పామర్రు(తోట్లవల్లూరు): ఒకవైపు వర్షాలు, మరోవైపు వరదతో లంక గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. కరకట్ట వెంబడి రైతులు, ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కృష్ణానదికి వరద పోటెత్తింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా వరద తీవ్రత పెరుగుతుండటంతో అటు లంక గ్రామాల ప్రజలు, ఇటు అధికారుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. ఆదివారం సాయంత్రానికి విజయవాడ ప్రకాశం బ్యారేజీ నుంచి సుమారు 8.30 లక్షల క్యూసెక్కుల వరదనీరు విడుదల చేయటంతో కరకట్ట వెంబడి గ్రామాలు, లంక గ్రామాల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. కృష్ణానది గర్భంలో పాములలంక, పిల్లివానిలంక, తుమ్మలపచ్చికలంక, కాళింగదిబ్బలంక, తోడేళ్ల దిబ్బలంక, పొట్టిదిబ్బలంక, ములకలపల్లిలంక, కనిగిరిలంక గ్రామాలు ఉన్నాయి. ఆయా గ్రామాల్లో 1,133 కుటుంబాలు, 3,124 మంది జనాభా నివశిస్తున్నారు. నదిలో వరద తీవ్రత మరింత పెరిగితే లంకలను ఖాళీ చేయించి పునరావాస కేంద్రాలకు తరలించాల్సి ఉంటుంది.

వరద పరిస్థితిపై జేసీ, ఎమ్మెల్యే సమీక్ష

వరద పరిస్థితిపై జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. లంకగ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అవసరమైన బోట్లు రప్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. తుమ్మలపచ్చిక లంక, తోడేళ్లదిబ్బలంక గ్రామాలలో జేసీ గీతాంజలి శర్మ, ఎమ్మెల్యే కుమార్‌రాజా పర్యటించి ప్రజలకు ధైర్యం చెప్పటంతోపాటు పునరావాస కేంద్రాలకు తరలి రావాలని కోరారు. డీపీఓ నాగేశ్వరనాయక్, ఉయ్యూరు ఆర్‌డీఓ రాజు, తహసీల్దార్ కుసుమకుమారి, సీఐ చిట్టిబాబు,ఎస్ఐ అర్జునరాజు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



తోట్లవల్లూరు తహసీల్దార్ కార్యాలయంలో సమీక్షిస్తున్న జేసీ గీతాంజలిశర్మ, ఎమ్మెల్యే కుమార్‌రాజా

పెదపారుపూడిలో..

పెదపారుపూడి: రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు వరి పంట పొలాల్లో నీళ్లు నిల్వటంతో పంట పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. పెదపారుపూడి పడమట పొలాల్లో సుమారు 150 ఎకరాల పొలాలు నీటిలోనే ఉన్నాయి. పక్కనే పాలకోడ్ డ్రెయిన్‌లో నీళ్లు ఎగతన్ని పంట పొలాల్లోకి నీళ్లు రావటంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

అప్రమత్తంగా వ్యవహరించండి

కైకలూరు: భారీ వర్షాల నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా వ్యహరించాలని ఏలూరు జెడ్పీ సీఈఓ, కై కలూరు మండల ప్రత్యేకాధికారి కేఎస్ఎస్ సుబ్బారావు పేర్కొన్నారు. మండలంలో ముంపు బారిన పడిన పుల్లవ, శ్యాంప్, వార్లకోడు డ్రెయిన్లను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కైకలూరు రెవెన్యూ కార్యాలయంలో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశామన్నారు.ఎంపీపీ అడవి కృష్ణ, సర్పంచ్ దానం మేరీ నవరత్నకుమారి, తహసీల్దారు ఉదయభాస్కర్, ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు, ఈఓపీఆర్డీ రవిశంకర్ పాల్గొన్నారు.

ప్రభుత్వం కంటి తుడుపు చర్యలు

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కాలేజీ గరల్స్ హాస్టల్ బాత్రూముల్లో రహస్య కెమెరాలు తామే పెట్టినట్లు చెప్పుకునే అదే కాలేజీకి చెందిన విద్యార్థిని సాత్వికను కాపాడేందుకే ప్రభుత్వం కంటి తుడుపు చర్యలు చేపడుతోందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఉపాధ్యక్షుడు లింగం జాన్‌బెన్నీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధాన నిందితురాలు సాత్విక అధికార కూటమికి చెందిన వ్యక్తి కుమార్తె కావటంతో ఆమెపై చర్యలు తీసుకోకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తున్నట్లు ఆరోపించారు. ఇప్పటికైనా కారకులైన నిందితులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

యూపీఎస్ రద్దు చేయాలని ఏపీటీఎఫ్ నిరసన

మొవ్వ: యూనిట్ పెన్షన్ స్కీమ్(యూపీఎస్)ను రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామారావు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెరుగైన ఎన్నికల పెన్షన్ విధానాన్ని తీసుకొస్తామని ఎన్నికల హామీని ఇచ్చి నిలబెట్టుకోవడం లేదన్నారు. మసిపూసి మారేడుకాయ చేసే విధంగా యూపీఎస్ విధానాన్ని తీసుకొచ్చారన్నారన్నారు. ఈ విధానం వలన కార్పొరేట్ సంస్థలకు లాభమని, ఉద్యోగుల బతుకులకు చరమాంకంలో ఆసరాగా నిలవదన్నారు. పెన్షన్ అనేది ప్రభుత్వం ఇవ్వాలనే గాని ఉద్యోగుల వద్ద చందా తీసుకుంటే అది పెన్షన్ ఎలా అవుతుందని ఆయన ప్రశ్నించారు. కార్యక్రమంలో కేకే సోమేశ్వరమ్మ, పీపీసీ ప్రసాద్, ఏ సురేష్, ఎస్ శివలక్ష్మి, జి.వెంకటేశ్వరరావు, బి.కిషోర్‌బాబు, బి.మాణిక్యాలరావు తదితరులు పాల్గొని తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది మెమోరాండం సమర్పించారు.



తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఏపీటీఎఫ్ నాయకులు

నేడు వీరంకిలాకులో వైఎస్సార్ వర్ధంతి

పమిడిముక్కల: వీరంకిలాకులోని వైఎస్సార్ విగ్రహం వద్ద సోమవారం దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యలమంచిలి గణేష్ తెలిపారు. మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని పేర్కొన్నారు.

లంకపల్లిలో పునరావాస కేంద్రం ఏర్పాటు

పమిడిముక్కల: మండలంలోని లంకపల్లి పాఠశాలలో పురావాస కేంద్రం ఏర్పాటు చేశారు. కృష్ణానదిలో వరద ప్రవాహం ఉద్ధృతంగా ఉన్నందున, నదీ పరివాహక గ్రామమైన లంకపల్లి వద్ద కరకట్ట పక్కన నివాసమున్న 21 మంది ఎస్టీలను పునరావాస కేంద్రానికి తరలించారు. భోజన వసతి ఏర్పాటు చేశారు. తహసీల్దార్ నవీన్‌కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నిలిచిన రాకపోకలు

నందివాడ: నందివాడ మండలం పుట్టగుంట వంతెనపై నుంచి బుడమేరు నీటి ప్రవాహం ఉద్ధృతంగా ఉండడంతో వాహన రాకపోకలు నిలిచిపోయాయి. అదేవిధంగా బుడమేరు పరివాహక ప్రాంతాలైన చేదుర్తిపాడు, ఒద్దులమెరక, పుట్టగుంట, అరిపిరాల, రామాపురం, కుదరవల్లి, ఇలపర్రు, లక్ష్మీనరసింహపురం, పాటు చిన, పెద లింగాల, జనార్ధనపురం, నందివాడ తదితర గ్రామాల్లోనూ వేల ఎకరాల పంటపొలాలు నీట మునిగిపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.